

## జోష్ నింపిన రోడ్‌షో..


ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళ వారం మెదక్‌కు విచ్చేసిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఘన స్వాగతం పలికారు. మెదక్‌లోని ప్రధాన కూడలైన రాందాస్ చౌరస్తాలో నిర్వహించిన రోడ్‌షో జనసంద్రంగా మారింది.

-మెదక్ మున్సిపాలిటీ, మే 7

# నేడు గులాబీ బాస్ రాక

- నర్సాపూర్, పటాన్‌చెరులో కేసీఆర్ బస్సుయాత్ర

సంగారెడ్డి (నమస్తే తెలంగాణ)/ నర్సాపూర్, మే 7: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం సంగారెడ్డి జిల్లాకు బీఆర్ఎస్ అధినేత, గులాబీ బాస్ కేసీఆర్ రానున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కేసీఆర్ బస్సు యాత్ర, రోడ్ షోలో ప్రజలు, యువకులు, రైతులు భారీగా తరలివస్తున్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో బస్సుయాత్ర ముగించుకున్న అనంతరం కేసీఆర్ మధ్యాహ్నం సంగారెడ్డి జిల్లాలోకి ప్రవేశించనున్నారు. గుమ్మడిదల నుంచి కేసీఆర్ బస్సు యాత్ర సంగారెడ్డి జిల్లాలో ప్రారంభమవుతుంది. గుమ్మడిదల వద్ద సీఎం కేసీఆర్‌కు పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు పెద్దఎత్తున స్వాగతం పలుకనున్నాయి. కేసీఆర్ బస్సు యాత గుమ్మడిదల నుంచి జిన్నారం మీదుగా పటాన్‌చెరు పట్టణం వరకు కొనసాగనున్నది. మార్గమధ్యంలో కేసీఆర్ ప్రజలు, రైతులు, యువకులు తదితర వర్గాల వారిని కలిసి మాట్లాడే అవకాశం ఉంది. కేసీఆర్ బస్సుయాత్ర పటాన్‌చెరుకు చేరుకున్నాక పోలీస్‌స్టేషన్ వద్ద సాయంత్రం కేసీఆర్ రోడ్‌షో జరుగనున్నది. కేసీఆర్ రోడ్‌షోను భారీఎత్తున నిర్వహించేందుకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఏర్పాట్లు చేసున్నారు. 50 వేల మందితో కేసీఆర్ రోడ్‌షో నిర్వహించేందుకు బీఆర్ఎస్ సన్నాహాలు చేస్తుంది. జనవాహినితో రోడ్లన్నీ జనమయం కావడంతో పాటు కేసీఆర్ ప్రసంగాన్ని ఆసక్తిగా వినేందుకు పెద్దసంఖ్యలో తరలిరానున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, నాయకులు రానున్నారు.



**నర్సాపూర్‌లో..**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బుధవారం నర్సాపూర్ పట్టణానికి రానున్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా కేసీఆర్ రోడ్ షో (బస్సుయాత్ర) చేపట్టనున్నారు. సాయంత్రం 5 గంటల సమయంలో నర్సాపూర్ పట్టణంలోని రెడ్‌ఫోర్ట్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగనున్నది. అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రసంగించనున్నారు. కేసీఆర్ ప్రసంగాన్ని వినడానికి నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలు ఆత్రుతతో ఎదురుచూస్తున్నారు. నియోజకవర్గ పరిధిలోని ఎనిమిది మండలాల నుంచి ప్రజలను పెద్దసంఖ్యలో రోడ్ షోకి తరలించేందుకు నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు.



చిలిపిచెడ్ : చండూర్ వర్షానికి తడిసిన ధాన్యం



మెదక్ మున్సిపాలిటీ : తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు



మెదక్‌లో కురిసిన వడగండ్లు



మెదక్‌రూరల్ : వర్షంతో కూలిన రేకుల ఇల్లు

# అకాల వర్షం.. తడిసిన ధాన్యం

మెదక్ మున్సిపాలిటీ/చిలిపిచెడ్(కొల్చారం)/మెదక్‌రూరల్, మే 7 : ఈదురు గాలులు, వడగండ్లతో మంగళవారం సాయంత్రం కురిసిన అకాల వర్షం జిల్లాలోని అన్నదాతలను కష్టాల్లోకి నెట్టేసింది. కొనుగోలు కేంద్రాల్లో సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో ధాన్యం తడిసి ముద్దయ్యింది. జిల్లాలోని ఆయా కొనుగోలు కేంద్రాల్లో సరైన వసతులు అధికారులు కల్పించక పోవడంతో రైతులకు నష్టం వాటిల్లింది. తడిసిన ధాన్యాన్ని ఎలాంటి తరుగు విధించకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. మెదక్ మండల పరిధిలోని మల్కాపూర్ తండాలో వడగండ్ల వర్షం, గాలి దుమారంతో రెండు ఇండ్లు కూలిపోయాయి.



తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ శివారులో విరిగి విద్యుత్ స్తంభం



చిలిపిచెడ్ : బద్రియ తండాలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అశోక్‌రెడ్డి



మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌లో ఇంటింటా ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సుజిత్‌రెడ్డి , నేతలు



చేగుంట : కర్నాల్‌పల్లిలో ప్రచారం చేస్తున్న యూత్ సభ్యులు



మెదక్‌రూరల్ : నాగారంలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న హవేళీఘన్‌పూర్ ఎంపీపీ శేరి నారాయణరెడ్డి



శివ్వంపేట: గుండ్లపల్లిలో ప్రచారం చేస్తున్న ఆత్మకమిటీ మాజీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి

# జోరుగా ప్రచారం

ప్రచారంలో గులాబీ దండు దూసుకుపోతోంది. జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలంతా రెట్టింపు ఉత్సాహంతో క్షేత్రస్థాయికి వెళ్లి జనంతో మమేకమవుతున్నారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అడుగుతూ బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్నారు. రాష్ట్రంలో అబద్ధపు హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, పదేండ్లుగా పేదలకు ఏమీ చేయని కేంద్ర బీజేపీ సర్కారుకు బుద్ధిచెప్పి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు.

- మెదక్ జిల్లా నెట్‌వర్క్, మే 7



అల్లాదుర్గం: కాయిదంపల్లిలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



చేగుంట: చందాయిపేటలో ఇంటింటా ప్రచారంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నారాయణరెడ్డి, జిల్లా నాయకులు



చేగుంట మండలకేంద్రంలో మండల మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్



నర్సాపూర్ : ఎర్రకుంటతండాలో ప్రచారం చేస్తున్న ఓయూ జాక్ చైర్మన్, బీఆర్ఎస్ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కరాటే రాజునాయక్



తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు సతీశ్‌చారి, నాయకులు

## బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న రొమాల రాజు

చేగుంట, మే 7 : దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో నార్సింగికి చెందిన కాంగ్రెస్ నేత రొమాల రాజు మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నార్సింగి మండలాధ్యక్షుడు మైరాంబాబు, జడ్పీటీసీ బాణపురం కృష్ణారెడ్డి, యూత్ నాయకుడు శ్రీకాంత్‌గౌడ్, దుబ్బాక జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, ఎల్లారెడ్డి ఉన్నారు. మెదక్‌లో నిర్వహించే కేసీఆర్ రోడ్డు షోకు చేగుంట నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు.

**చిలిపిచెడ్‌లో..**

చిలిపిచెడ్(కొల్చారం), మే 7 : మండల కేంద్రమైన కొల్చారం గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్తలు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సమీక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్‌కు ఓటేస్తే దేశ భద్రత ప్రమాదంలో పడుతుందన్నారు. పార్టీలో చేరిన వారు ఆంజనేయులు, షేకులు, నాగయ్య, నర్సింహులు, రాజయ్య, పిల్లి సత్యనారాయణలతో పాటు 30 మంది ఎమ్మెల్యే బీఆర్ఎస్‌లో చేరారు. కొల్చారం మాజీ సర్పంచ్ కరెంట్ ఉమా రాజాగౌడ్, ఎంపీపీ మంజుల, జడ్పీటీసీ మేఘమాల, మండలాధ్యక్షుడు గౌరీశంకర్, మండల యూత్ అధ్యక్షుడు సంతోశ్ రావు, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, యువ నాయకుడు రవితేజ రెడ్డి పాల్గొన్నారు.



చిలిపిచెడ్(కొల్చారం) : ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న నేతలు

## బీఆర్ఎస్‌దే..గెలుపు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ర్యాకల శేఖర్‌గౌడ్

మనోహరాబాద్, మే 7 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయకేతనం ఎగురవేయడం ఖాయమని బీఆర్ఎస్ రాష్ట్ర నా యకుడు ర్యాకల శేఖర్‌గౌడ్ అన్నారు. మనోహరాబాద్‌లో ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారం వచ్చిన నాలుగు నెలల్లోనే కాంగ్రెస్‌పై ప్రజలు విరక్తి చెందారని, పదేండ్ల కేసీఆర్ పాలనను గుర్తుకు తెచ్చుకుంటున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న బీఆర్ఎస్ ఇం టింటా ప్రచారానికి ప్రజల మద్దతు పెరిగిందన్నారు. బీఆర్ఎస్ నాయకులు మహేందర్‌గౌడ్, కుమార్, పాండు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో సోదాలు

- రామాయంపేటలో తనిఖీలు నిర్వహించిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం

రామాయంపేట, మే 7: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా రామాయంపేట పట్టణంలోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం సభ్యులు భూపాల్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి బీఆర్ఎస్ క్యాంపు ఆఫీస్‌లో తనిఖీలు చేశారు. తనిఖీలో రామాయంపేట సీఐ వెంకటేశ్, ఎస్సై రంజిత్, ఇతర పోలీస్ సిబ్బంది, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం

## వడదెబ్బతో ఉపాధికూలీ మృతి

శివ్వంపేట, మే 7 : వడదెబ్బతో ఉపాధిహామీ పనులకు వెళ్లిన కూలీ మృతి చెందిన ఘటన శివ్వంపేట మండలం కొంతాన్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే.. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కలకంటి లక్ష్మి (50) రోజు మాదిరిగా ఉదయం సమయంలో ఉపాధిహామీ కూలీ నిమిత్తం అందరితో కలిసి వెళ్లి మధ్యాహ్నం వరకు పనులు చేసింది. ఇంతలోనే ఒక్కసారిగా కళ్లు తిరుగుతున్నాయంటూ కుప్పకూలి స్పృహ కోల్పోయింది. స్థానికులు వెంటనే తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.



లక్ష్మి మృతదేహం

## ధాన్యపు రాశులు తడవకుండా చర్యలు తీసుకోవాలి

మెదక్ మున్సిపాలిటీ, మే 7 : వాతావరణ శాఖ సూచనల మేరకు రానున్న మూడు రోజుల పాటు అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు ధాన్యం రాశులు తడవకుండా భద్రపర్చాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్లతో కప్పి ఉండాలని రైతులకు సూచించారు.



అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

## ఓటు హక్కు వినియోగించుకున్న ఉద్యోగులు

నర్సాపూర్,మే 7 : ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగ ఉపాధ్యాయులు మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులు రేపటిలోగా తమ ఓటు హక్కును సద్వినియోగపరుచుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎంఈవో బుచ్చానాయక్, పీఆర్టీయూటీఎస్ మండల ప్రధాన కార్యదర్శి సామ్యానాయక్, జిల్లా కార్యదర్శి ఎల్‌కే.చందర్, మండల కార్యదర్శి ఇంతియాజ్ పాల్గొన్నారు.

**రామాయంపేటలో..**

రామాయంపేట, మే 7 : మెదక్ జిల్లా నిజాంపేట మండలం చల్మెడ గ్రామానికి చెందిన హైదరాబాద్ రాచకొండ టాస్క్‌ఫోర్స్ డీసీపీ నంద్యాల నర్సింహరెడ్డి మంగళవారం మెదక్ రెవెన్యు డివిజనల్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటుహక్కు వజ్రాయుధం లాంటిదని ఓటుహక్కును ప్రతి ఒక్కరు సద్వినియోగించుకోవాలన్నారు.



నర్సాపూర్‌లో సిరా చుక్కను చూపిస్తున్న ఉద్యోగులు

## భూమిని సారవంతం చేయాలి

రామాయంపేట, మే 7: వానకాలంలో ముందుగానే వర్షాలు పడక ముందే దుక్కి దున్ని భూమిని సారవంతం చేస్తే వర్షాలు పడే నాటికి భూమిలో ఉన్న పోషకాలు పెరుగుతాయని రామాయంపేట వ్యవసాయ శాఖ డివిజన్ సహాయ సంచాలకులు వసంత సుగుణ పేర్కొన్నారు. మంగళవారం రామాయంపేట పట్టణ శివారులో రైతుల పొలాలను సందర్శించి పలు సలహాలు, సూచనలు చేశారు. ఏఈవోలు రాజు నాయక్, సాయి కృష్ణ, రైతు అశోక్ ఉన్నారు.



భూమిని పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

## ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

రామాయంపేట, మే 7: సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని హైకోర్టు న్యాయవాది మౌనిక సుంకర అన్నారు. మంగళవారం రామాయంపేటలోని వివేకానంద ఆవాస విద్యాలయంలో హిందూ జాగరణ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడా రు. మనమంతా ఒక్కటైతేనే మనపై దాడికి ఎవరూ రన్నారు. కార్యక్రమంలో పుట్టి మ ల్లేశం, శంకర్‌గౌడ్, భానుచందర్, యాదగిరి తదితరులు ఉన్నారు.

## నిందితురాలికి జీవిత ఖైదు

మెదక్ అర్బన్, మే 7 : వ్యక్తిని హత్య చేసిన నిందితురాలికి జీవిత ఖైదుతో పాటు రూ.15 వేలు జరిమానాను జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద విధించినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ బాలస్వామి మంగళవారం తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌లో 2020లో నమోదైన కేసులో చిన్న చింతకుంట గ్రామానికి చెందిన నిందితురాలు నర్సాపూర్ పట్టణానికి చెందిన శివ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకొని అతడిని హత్య చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా, పూర్తి సాక్ష్యాధారాలను పరిశీలించి కోర్టుకు నివేదించారు. నిందితురాలికి జీవిత ఖైదుతో పాటు జరిమానా విధించారు. నిందితురాలికి శిక్ష పడేలా సాక్ష్యాధారాలను కోర్టుకు నివేదించిన జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఫజల్ ఆహ్మద్, నర్సాపూర్, కోర్టు కానిస్టేబుల్ రవిగౌడ్‌లను ఎస్పీ అభినందించారు.

## యువకుడి ఆత్మహత్య

మనోహరాబాద్, మే 7 : ప్రేమించిన యువతికి పెండ్లి కుదరడంతో మనస్తాపానికి గురై ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై కరుణాకర్‌రెడ్డి వివరాల ప్రకారం.. మనోహరాబాద్‌కు చెందిన మహ్మద్ సాహె ల్ (24) ఆటో డ్రైవర్. కాగా సాహెల్ ప్రేమించిన యువతికి పెండ్లి కుదరడంతో మనస్తాపానికి గురై సోమవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

## పోలీసులమని డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తి రిమాండ్

మెదక్ అర్బన్, మే 7 : పోలీసులమని పేరు చెప్పుకొని మెదక్‌లోని వివిధ వ్యాపారస్తులను, ఇసుక వ్యాపారం చేసే వ్యక్తులను పోలీసులు తమ వెంట ఉన్నారని బెదిరిస్తూ వారిని, వారి వాహనాలను ఎక్కడ పడితే అక్కడ వెంబడించి డబ్బులు దోపిడీ చేస్తున్నాడని మెదక్ పట్టణ పోలీసులు తెలిపారు. మెదక్ పట్టణ సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ పట్టణంలోని ఇందిరాపురి కాలనీకి చెందిన ఆముదా రఘు అనే వ్యక్తి పోలీసు అని పేరు చెప్పుకొని వ్యాపారస్తుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఇతడిపై గతంలో హైదరాబాద్‌లోని అఫ్జల్ గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో రేప్ కేసు, హవేళీఘనపూర్ పోలీస్ స్టేషన్‌లో ఒక దోపిడీ కేసు, మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 7 కేసులు ఉన్నాయని ఇతడికి వివిధ కేసుల్లో కోర్టు గతంలో శిక్ష విధించిందని అయినప్పటికీ అతడి ప్రవర్తనలో ఎటువంటి మార్పు రాలేదని పేర్కొన్నారు. పోలీసుగా నటిస్తూ అమాయకులైన వారిని బెదిరించి దౌర్జన్యం చేసి డబ్బులు దోపిడీ చేస్తూ పట్టుబడగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు కోర్టులో హాజరు పరిచామని పేర్కొన్నారు.

## వర్గీకరణ జరగాలంటే బీఆర్ఎస్‌కే ఓటు వేయాలి

సిద్దిపేట టౌన్, మే 7 : ఎన్నికల్లో ఓటు వేసే యంత్రాలుగా చూస్తున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులకు.. మాదిగల ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సిద్దిపేటలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో చేస్తామని చెప్పిన బీజేపీ అది చేపట్టకుండా రిజర్వేషన్లను తొలిగిస్తామంటున్నారన్నారు. ఎంపీ టికెట్ కేటాయించకుండా మాదిగలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఓటు ద్వారా మాదిగల శక్తి ఏంటో చూపించాలన్నారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా ఉన్న బీఆర్ఎస్ పార్టీకే ఓటు వేయాలని మాదిగ, మాదిగ ఉపకులాలకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. మూడోసారి కేంద్రంలో అధికారం వస్తే రిజర్వేషన్లు తొలిగిస్తామని చెబుతున్న బీజేపీ మాదిగలను ఓట్లు ఎలా అడుగుతుందో సమాధానం చెప్పాలన్నారు. అత్యధిక జనాభా కలిగిన మాదిగ సామాజిక వర్గానికి ఒక్క ఎంపీ టికెట్ కూడా కేటాయించకుండా మరోసారి మాదిగ ఓట్లతో గద్దనెక్కాలనుకునే కాంగ్రెస్‌కి తగిన బుద్ధి చెప్పాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి రాజేందర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర ఎల్లం, దేవులపల్లి రాజేందర్, గద్దం వెంకటేశ్, గుడి కందుల ఎల్లం, చెప్పాల దుర్గయ్య, గాజుల రవి, బుర్ర పోశయ్య పాల్గొన్నారు.